# కంఠశోష

శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

తల్లి:-సురభి అందంలో జతే అని సుగంధి కూడ సర్టిఫికెట్టు యిస్తుంటె యింకా అనుమానిస్తావేమిట్రా! పెళ్లి పేరంటం అంటారు. ఏ యీడప్పుడు ఆ వేడుక లుండాలిగాని తర్వాత అవి రమ్మంటే మాత్రం వస్తాయిట్రా! ఏం ... మాట్లాడవే! ...

కొడుకు:-ఆ ... సుగంధి చెప్పంగానే సరేమిటి ... ఆడవాళ్లకు ఆడవాళ్లు నచ్చరు మరి. అందంగా వుందో లేదో మగవాళ్లు చెప్పాలి.

తల్లి -అవుతే తమ్ముణ్ణి అడుగు; నాన్నగార్ని అడుగు. పిల్ల బంగారంవంటిది- పిల్లకే వంక పెటతారుగా.

సుగంధి:-అన్నయ్యా అదిగాదు. మగవాళ్ల కళ్లకు అందరు ఆడవాళ్లు బాగానేవుంటారు. ఆడది అందంగా వుందోలేదో ఆడదే చెప్పాలి. దానిలో వుంది మజా.

తల్లి:-అవునేవ్ ఆమాటా నిజమే. . ఏరా అవుతే అమ్మాయి చెప్పినట్లు, నేను, సుగంధి అందంగా వుందని చెప్పాతున్నాముగా.

కొడుకు:-సరేలే ప్రతిపాదనలు, సవరణలు, నిర్ణయాలు అన్నీ మీవేనా, ఇకనన్ను అడగటం యెందుకు!

తల్లి:-పోనీ సవరణ యేమిటో చెప్పరాదూ.

కొడుకు: సురభికంటే బాగున్నవాళ్లు లేరా!

తల్లి:-ఆమాటెందుకు. నీకు సురభినచ్చలేదా?

కొడుకు:-ఆవిషయం తర్వాత, ముందర నా ప్రశ్నకు సమాధానం చెప్పు; సురభికంటె అందమైనవాళ్లు లేరా?

సుగంధి:-అట్లా అవుతే నువ్వెంత అందమైన వాళ్లనైనా తీసుకురా నేను వంక పెట్టేటట్లు.

కొడుకు:-ఓహో తెలిసింది. సురభికి వంక వున్నదన్న మాటేగా.

సుగంధి:-సరేలే అన్నయ్యా నువ్వెప్పుడూ యిలాంటి అర్థాలే తీస్తావు. సురభికివంక వుందని చెప్పానేమిటి?

తల్లి:-మనిషి అన్న తర్వాత వంకలుండక పోతాయా! నువ్వు తీసుకొస్తావా వంకలు లేనిదాన్ని. నిక్షేపంలాంటి పిల్ల వుంటే దానికేదో వంక పెడుతున్నాడు. ఏముంది వంక చెప్పు.

కొడుకు:-చెప్పటం మొదలు పెట్టితే యెన్నైనా చెప్పచ్చులే.

సుగంధి:-వూరికే మాటలనటం కాదు. చెప్పు చూద్దాం.

కొడుకు:-నాకు దాని వంకలన్ని చెప్పటమే పని వాళ్లమ్మాయి మంజు చూడు ఎట్లా వుంటుందో!

తల్లి:-పొరిగింట పుల్లకూర రుచని, అయిన వాళ్లను వదులుకొని, పరాయి వాళ్ల మాట యెందుకంట.

సుగంధి:-అమ్మా వూరుకోవే నువ్వు. పోనీ అన్నయ్యా మాటే సరి అందాము, ఏం మంజు అందంగా వుందంటావా సురభి కంటె.

కొడుకు:-నీకు సందేహామా!

సుగంధి: గరుత్మంతుడు లాగ ఉముక్కు- అదీను. ఏం తెలుసు నీకు ఆడదాని అందం.

కొడుకు:-రాగా రాగా మంజును ఆక్షేపించాల్సిందే ...

తల్లి:-అవన్నీ అనవసరం. ఇంతకీ ముఖ్యమైన మాట నీకు సురభి నచ్చిందా లేదా!

కొడుకు:-నాకు యీ చదువు పూర్తికావాలి. అప్పుడు ..

తల్లి:-చదువుకూ పెళ్లికి సంబంధం యేమిటి. చదువుకుంటున్న వాళ్లంతా పెళ్లి చేసుకోకుండా వుంటున్నారా! అయినా అడిగినదానికి సమాధానం చెప్పు.

సుగంధి:-అన్నయ్య యెప్పుడూ యింతేనే.

తల్లి:-ఏరా; ఇంత కట్నం కానుక యిచ్చే వాళ్లే. ఈడూ జోడూ బాగుంటుంది. ఏమంటావు?

కొడుకు:-అన్నీ బాగానే వున్నాయి కాని ఆమూతి దగ్గరే కొంచెం ...

సుగంధి:-అవున్లే మూతిదగ్గరేగా ... ...

తల్లి:-మరీ అల్లరి పిల్లవవుతున్నావే. అన్నయ్య వున్నాడని లేదు-ఏం లేదు...

కొడుకు:-అనసీక పోయినావు ఏమనేదో వినేవాళ్లం ...

తల్లి:-చెల్లెలికి దగ్గ అన్న .. చెప్పు నాయనా చెప్పు ... సురభికి సంగీతం కూడ చెప్పిస్తున్నారు.

సుగంధి:-ఆమాట నాదగ్గర చెప్పక, అన్నయ్యా, సంగీతము మీద మాత్రం ఆశ పెట్టుకోక గొంతిక ...

కొడుకు:-ఒకదానిమీద ఆశ పెట్టుకుంటున్నానా, నువ్వు సంగీతం మీద ఆశ పెట్టుకోవద్దనటానికి.

తల్లి:-అవన్నీ యెందుకుగాని, ముఖ్యమైనవి ఆడదానికి పని పాటలు అన్నారు, పనులన్ని చేస్తుంది. ఇప్పుడు వాళ్లమ్మకు అండగా వుందనుకున్నావు.

కొడుకు:-అదా నీగొడవ, పెళ్లి అవుతే నీకు పనన్నా తప్పుతుందనా! ...

తల్లి:-ఆ! .. కోడలు వచ్చి వారుస్తుందని తొందర పడుతున్నా. విషయానికి చెప్పాగాని, అది వచ్చి నాకు చేసేదేమిటి, నాచేత చేయించుకోకుండా వుంటేచాలు. కాలు చెయ్యి తిన్నగా వున్నంత వరకు, నేను యెవ్వరిచేత చేయించుకోక్కర్లేదు. ఈఘటం యిట్లా వుండగానే దాటిపోతే చాలని వేయి దేవుళ్లకు మొక్కుకుంటున్నా.

సుగంధి:-మాట మాట్లాడితే సరి దాటి పోవటం దాటిపోవటం ...

తల్లి:-ఇంతకీ ఏమంటావురా!

కొడుకు:-ఇంకా పెద్దదైనకొద్దీ లావు అవుతుందేమో అనిపిస్తోందే.

తల్లి:-అదేం లావు అవదులే. గుమ్మటంలాగ వుండాలసిన రీతిగానే వుంది. నీకా భయం అక్కర్లేదు.

కొడుకు:-మరింకేభయం కావాలి ...

తల్లి:-వూరికే విసిగించక ప్రాణం. ఏభయం అక్కర్లేదు. నీకు పిల్లనచ్చితే చాలు.

కొడుకు:-నాకు నచ్చితే చాలా ...

తల్లి:-నీకు నచ్చక యింకెవరికి నచ్చాలి? చేసుకునేది నువ్వా మరెవరు?

కొడుకు:-ఆ...అది కాదు మీ అందరికికూడా నచ్చాలిగదా అని.

సుగంధి:-మా మాట అదివరకే చెప్పాంగా ఇంకొకసారి పెళ్ళిం సంగతి మాచేత చెప్పిద్దామని ...

కొడుకు:-అప్పుడే పెళ్లాన్ని చేశావూ.

సుగంధి:-అమ్మా, అసలు యింతకీ వదినను అడిగారా, యిందాకటినుంచి, అన్నయ్యను అడగటంలోనే సరిపోతోంది.

తల్లి:-ఎక్కడైనా మగవాళ్లను అడుగుతారు కాని, ఆడపిల్లను అడగటమేమిటే.

సుగంధి:-అది మీకాలం. ఇది మాకాలం. పురుషునికి యెంతహక్కో స్త్రీకి అంత హక్కే.

కొడుకు:-అవును భార్యా భర్తలు సమాన భాగస్వాములుగా నిజమే.

తల్లి:-ఈ మాటలకేం కాని, చెప్పరా నాయనా చెప్పు. ఖాయం చెయ్యమంటావా. అయిన వాళ్లతో పని, బంధుత్వము వృద్ధి అవుతుంది ...

కొడుకు:-సరే యిన్ని చెపుతున్నారుగా, ఇంకా నేనెట్లా కాదనటం.

సుగంధి:-అమ్మా, నేను చెప్పలా, అన్నయ్యకు చేసుకోవాలనే వుందే. కాని మనచేత చెప్పిద్దామని ఆడిననాటకం. సురభి అందంగా వుంటుందని అన్నయ్యకు మాత్రం తెలీదూ. అమ్మా అన్నయ్య తేల్చి చెప్పాడుగా ఇక వదినను కూడా అడుగుదామే.

తల్లి:-దానిని అడిగేదేమిటే!

సుగంధి:-అయినా అడుగుదామే ఏం చెపుతుందో! ఇంట్లో లేనట్టుంది. స్కూలుకు వెళ్లిందేమో ... నూరేళ్ళ ఆయుర్దాయము అదుగో వస్తోంది. సురభీ బావ నిన్ను చేసుకోవటానికి వప్పుకున్నాడు ఇక నీవుద్దేశమేమిటో చెప్పు.

సురభి:-ఎన్నిసార్లు, మా అమ్మ వాళ్లకు అదివరకే చెప్పా. రాగిజుట్టు, చట్టిముక్కు బావను చేసుకోనని.

తల్లి:-ఆ...ఆ... అందాకా వచ్చిందా నీపని.

సురభి:-ఏం, ఎందాక వచ్చిందేమిటి, మగవాళ్లకేనేమిటి నచ్చాల్సింది. నాకు నచ్చితేనే చేసుకుంటా.

తల్లి:-వింటున్నావుట్రా.

సుగంధి:-అందుకనే గామాలు అన్నయ్యా నాకు నచ్చితే చాలా అన్నది.

(ఆలిండియా రేడియో హైద్రాబాద్ సౌజన్యంతో)